www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025

5

తూర్పుగోదావరి

జిల్లాలో 7.9 మిల్లీ మీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - కొవ్వూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి, నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో జిల్లాలో సరాసరి 7.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బిక్కవోలులో గరిష్టంగా 42.4, కనిష్టంగా సీతానగరం మండలంఓ 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఉండ్రాజవరంలో 20.6, అనపర్తిలో 16.4 పెరవలిలో 13.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాజమహేంద్రవరం రూరల్‌లో 9.6, నిడదవోలులో 8, రాజనగరంలో 5.2, రంగంపేటలో 4.8, కడియం, రాజమహేంద్రవరం అర్బన్‌లో 4.4, తాళ్లపూడిలో 3.8, కోరుకొండ కొవ్వూరు మండలాల్లో 3.4, గోకవరంలో 3.2 చాగల్లు గోపాలపురం మండలాల్లో 2.6 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదెంది.

తల్లీబిడ్డ సేవలెలా..?

- డ్రైవర్లకు అరకొర వేతనాలే దిక్కు
- మూడు నెలలుగా పెండింగ్
- పెట్రోలు కొరతతో సేవలకు ఆటంకం
- సమ్మె బాటలో సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలను సురక్షితంగా, సౌకర్యవంతంగా ఇంటికి చేర్చేందుకు తీసుకువచ్చిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అరకొరగానే అందుతున్నాయి. ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వల్ల పేద, సామాన్య వర్గాలకు ఎంతో ఉపయోగపడుతున్న ఈ వాహనాలను కనీసంగా మరమ్మతులు చేయించడం లేదు. చివరకు పెట్రోలు బిల్లులు సైతం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని సిబ్బంది వాపోతున్నారు.

తల్లీ బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 2016 జనవరిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పిహెచ్‌సి నుంచి జిల్లా ఆసుపత్రి వరకు ప్రభుత్వ ఆసుత్రుల్లో ప్రసవమైన తల్లీ బిడ్డ, వారితో ఉన్న కుటుంబ సభ్యులను ఉచితంగా వారింటికి క్షేమంగా చేరవేయడమే ఈ పథకం లక్ష్యం. ఉమ్మడి జిల్లాకు 31 వాహనాలు మంజూరు చేశారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాకినాడకు 8, రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రికి 5, తుని, అమలాపురం రెండేసి, పిఠాపురం, రౌతులపూడి, రామచంద్రపురం, తాళ్లరేవు, రాజోలు, కొత్తపేట, పెద్దాపురం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు, కూనవరంలో ఒక్కో వాహనం సేవలు అందిస్తున్నాయి. రోజుకి కనీసంగా 90 వరకు తల్లీబిడ్డలను ఇళ్లకు చేరుస్తున్నాయి.

అరకొర వేతనాలు ఆపై పెండింగ్

రోజురోజుకీ నిత్యవసరాలు వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో పేదలు, సామాన్యులు బతకాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఔట్ సోర్సింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు అరకొర వేతనాలను మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. వీటితో ఏ విధంగా కుటుంబాలను పోషించుకోవాలంటూ ఆయా వ్యవస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందిస్తున్న డ్రైవర్లకు కేవలం నెలకు రూ.7,800 మాత్రమే వేతనం ఇస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు కనీసంగా రూ.30 వేలు ఉంటేనే గాని కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదు. గత 8 ఏళ్లగా తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని అనేకసార్లు విన్నవించినా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదంటూ ఈ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 3 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు సైతం పుట్టక ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం

ఈ వాహనాల నిర్వహణను 2021 డిసెంబరు 31 వరకూ జివికె సంస్థ నిర్వహించింది. 2022 జనవరి 1 నుంచి అరబిందో నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. కానీ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఈ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ నెలకు రెండు సార్లు మాత్రమే కొట్టించుకోవాలంటూ సంస్థ చెబుతుండడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రస్తుతం 8 వాహనాలు మూలన పడ్డాయి. కాకినాడ జిల్లా కేంద్రంలో ఉన్న జిజిహెచ్‌లో 14 వాహనాలు ఉండగా 7 గురు మాత్రమే డ్రైవర్లున్నారు. దీంతో ఉన్న వారిపైనే ఒత్తిడి పెరుగుతోంది. పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. అందుకే సంస్థలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒకరోజు సమ్మె చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

ప్రభుత్వమే వేతనం ఇవ్వాలి

102 తల్లీబిడ్డ వాహనాలను ప్రభుత్వం నేరుగా నడిపి డ్రైవర్లకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి డ్రైవర్ల అందరిని పర్మినెంట్ చేయాలి. చట్టప్రకారం వీక్లీ ఆఫ్, పండుగలు, జాతీయ శెలవులు అమలు చేయించాలి.

- వల్లూరి కుమార్, డ్రైవర్, కాకినాడ జిజిహెచ్

వెట్టి చాకిరీ చేయిస్తున్నారు

తల్లీబిడ్డ వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల చేత 12 గంటలు డ్యూటీ చేయించుకుని కేవలం రూ.7,800 ఇవ్వడం దారుణం. చట్ట ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. 8 గంటల పని దినాలు అమలు చేయాలి. డ్రైవర్ల అందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి.

- మలకా వెంకటరమణ, సిఐటియు జిల్లా కోశాధికారి, కాకినాడ

కనీస వేతనం ఇవ్వాలి

పెండింగులో ఉన్న బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలి. కనీస వేతనం రూ.18,500 చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. యజమాని వాటా పిఎఫ్ ను యాజమాన్యమే చెల్లించాలి. ప్రతి సిబ్బందికీ ఇఎస్‌ఐ చెల్లించాలి.

-పి.సాయి, అధ్యక్షుడు, ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్

నిడదవోలులో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్.సుందర్‌బాబు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ మంగళవారం తాళ్లపూడిలోని రైస్ మిల్లర్స్ ఆవరణ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలా చట్టం తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజువారి వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్పొరేట్లకు, సంస్థల యజమానులకు, మోడీ ప్రియతములకు లాభాలను చేకూర్చేలా ఉన్నాయన్నారు. ఇవి అమలైతే కార్మికుల హక్కులు పూర్తిగా రద్దవుతాయన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరవు, ఆర్.రాజు, ఎ.శ్రీను, జి.సుబ్రహ్మణ్యం, ఎ.శంకరుడు, ఎన్.సుబ్బారావు, ఐ.నరసింహమూర్తి, సిహెచ్.ప్రకాశం, కె.గణేష్, సిహెచ్.ధర్మయ్య, ఎస్‌కె.బాబ్జి, వి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

నిడదవోలు : కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ నిడవోలు గణపతి సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లకు ఉద్యో గభద్రత కల్పించాలని, కనీస పింఛను రూ.10వేలు చెల్లించాలని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ రద్దు చేయాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని నిదించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ప్రభుత్వరంగ సంస్థల రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జువ్వల రాంబాబు, గంటి కృష్ణ, జి.డేనియల్, యర్రా శ్రీను, రసూల్ గోపి, ప్రభాకర్ రాఘవ, శ్రీరామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో...

అన్నందేవుల చంటికి జీవ వైవిధ్య పురస్కారం

ప్రజాశక్తి-కడియం

అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే జీవవైవిధ్య సంరక్షణ పురస్కారానికి కడియం మండలం మాధవ రాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల వీరవెంకటసత్యనారాయణ (చంటి) ఎంపికయ్యారు. ఈ నెల 22న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. చెట్లు సంరక్షణ, మూగజీవుల సంరక్షణ, సేంద్రియ వ్యవసాయం, సంస్కృతి సంప్రదాయాలు, పర్యావరణ సంరక్షణ, తదితర అంశాలలో ఆయన చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి మెంబర్ సెక్రటరీ పి.రామకృష్ణ ఈ మేరకు చంటికి ఎంపిక పత్రాన్ని పంపించారు. 20 ఏళ్ల నుంచే రోడ్డు కిరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించటం, గోవులు, ఇతర పాడిని చక్కగా పెంచడం, పురాతన మండువాలోగిలిని పున ప్రతిష్ఠాపించటం, గ్రామీణ జానపద కళలు గరగలు, గారడీలు వంటి వాటిని ప్రోత్సహించి సంరక్షించడం, వరి కుచ్చులు కట్టించి పక్షి జాతులను కాపాడడం, ఇంకుడు గుంతలు తవ్వించి భూగర్భ జలాలను సంరక్షించడం, సోలార్ యూనిట్ల ద్వారా ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవటం, ఔషధ మొక్కల పెంచడం వంటి కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు.

టెక్నికల్ హబ్ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

టెక్నికల్ హబ్ స్థాపనకు అవసరమైన స్థలం కోసం బొమ్మూరులోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం కార్యాలయం ఆవరణను కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయ భవనం పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లా యువతకు మరింత ఉపాధి, ఆవిష్కరణ అవకాశాలు కల్పించేందుకు ఈ ప్రాంగణంలో ప్రాథమిక శిక్షణ తరగతులు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌తో టి-హబ్ ఆధునిక సంస్థ స్థాపన సాధ్యాసాధ్యాలపై పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కి కేటాయించిన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. స్థల లభ్యత, సద్వినియోగం, భవిష్యత్తు అవసరాలకు అనుకూలతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతకు స్టార్టప్‌లు, ఇన్నోవేషన్, టెక్నాలజీ రంగాల్లో మార్గదర్శకంగా నిలిచేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంటుతో భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళిక తయారు చేయాలని ఎపిఇడబ్ల్యుఐడిసి అసిస్టెంట్ ఇంజినీర్ శంకర్‌ను ఆదేశించారు. కేంద్ర నిధులతో చేపట్టనున్న నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత భవనంలో నైపుణ్య శిక్షణలు త్వరితగతిన ప్రారంభించాలని నైపుణ్యాధికారిని ఆదేశించారు. ఆమె వెంట ల్యాండ్ సర్వేయర్ ఎడి బి.లక్ష్మీనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విడిజి.మురళి, తహశీల్దార్, సిబ్బంది ఉన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

టార్గెట్ బాల్‌లో చాగల్లు విద్యార్థులకు బంగారు పతకం

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో చాగల్లు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకం సాధించారని పీడీ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 17,18 తేదీల్లో నెల్లూరులో జరిగిన 5వ సీనియర్ స్టేట్ టార్గెట్ బాల్ పోటీల్లో చాగల్లు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. బాలికల విభాగంలో బంగారు పతకం, బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచారని తెలిపారు. 65 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పాఠశాలకు 5 ఎకరాల స్థలం ఉందన్నారు. అయితే క్రీడలకు ఉపయోగించుకునేందుకు వీలు లేకుండా ఉందని, గ్రౌండ్ బాగుంటే అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేస్తామని పీడీ తెలిపారు. ఇప్పటికే జాతీయ స్థాయి పోటీల్లో కూడా బంగారు పతకాలను తమ విద్యార్థులు సాధించారన్నారు. రాష్ట్రాలకు జిల్లాల్లో జరిగే పోటీలకు హాజరయ్యేందుకు విద్యార్థులు ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దాతలు సాయం చేస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. విజయం సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం మోహన్‌కృష్ణ, సిబ్బంది, ఎస్‌ఎంసి చైర్మన్ గోపాలకృష్ణ, గ్రామస్తులు అభినందించారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలని అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పబ్లిక్ హెల్త్‌పై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో మురుగు కాలువల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పూడిక తొలగించాలన్నారు. ప్రతి రోజూ ఇంటింటా చెత్త సేకరణ జరపాలన్నారు. తడి, పొడ చెత్త సేకరణ వేర్వేరుగా జరగాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రం డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్తసేకరణ వాహనాల తీరుపై ఆరా తీశారు. రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని.. ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రాత్రి వేళల్లో పనిచేసే పారిశుధ్య సిబ్బందికి తప్పని సరిగా రేడియం ఆప్రాన్‌లు ఉండాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సిబ్బందికి రెయిన్ కోట్లు కూడా అందిస్తామన్నారు. వర్షాల దృష్ట్యా యాంటీ లార్వా ఆపరేషన్లను నగరంలో రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. దోమలు వృద్ధి కేంద్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి.. లార్వా దశలోనే నియంత్రించడంపై దృష్టి సారించాలన్నారు. కాలువలు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేసి., రసాయనాలు పిచికారీ చేయాలన్నారు. పరిస్థితులకు అనుగుణంగా హ్యాండ్ స్ప్రేయింగ్ యంత్రాలను పెంచుకోవాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పెయింటింగ్స్ ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. ఐఇసి(ఇన్ఫర్మేషన్-ఎడ్యుకేషన్-కమ్యూనికేషన్) యాక్టివిటీస్‌ను తరచూ నిర్వహించాలన్నారు. మలేరియా సిబ్బందికి, సచివాలయ కార్యదర్శులకు మధ్య సమన్వయం తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌ఒ వినూత్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్ వైజర్లు, బయాలజిస్ట్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న 102 సిబ్బంది

సమస్యలపై తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలను పరిష్కరించాలంటూ తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ 102 సర్వీస్ డ్రైవర్లు మంగళశారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వీరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమరాజు హాజరై సంఘీభావం ప్రకటించారు. 102 సర్వీస్‌ను 2015లో ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు వీరికి కేవలం రూ.8,800 జీతం ఇస్తున్నారన్నారు. గడిచిన పదేళ్లలో ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వాలు మారాయి కంపెనీలు మారాయి గాని తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల జీవితంలో వెలుగులు మాత్రం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 108, 104 సర్వీస్ ఉద్యోగులకు జీతాలు పెంపుదల చేశారన్నారు. కాని తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు మాత్రం ఎటువంటి పెంపుదల లేకుండా అదే జీతంతో కొనసాగిస్తున్నారని తెలిపారు. 102 ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు, పాలకులకు, సర్వీస్ నడుపుతున్న అరబిందో సంస్థ ప్రతినిధులకు పలుమార్లు విన్నపించుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడైనా తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జీతాలు మాదిరిగా రు.18,500 వేతం ఇవ్వాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే కోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.రామదాసు, వరప్రసాద్‌రెడ్డి, పి.మణికంఠ, ఎ.సూర్య ప్రకాష్, బి.రాజేష్ సుబ్రహ్మణ్యం, ఎం.కుమార్ బాబు, డి.శివాజీ, ఎన్.వినోద్ కుమార్ పి.నాగరాజు, పి.రవి, పి.అరవాలు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన ఎస్‌సి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి -కొవ్వూరు:



భువనేశ్వరితో జవహర్ కుటుంబం

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి కెఎస్.జవహర్ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని మర్యాద పూర్వకంగా కలిశారు. కుటుంబ సమేతంగా తాడేపల్లి వెళ్లి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. జవహర్ సతీమణితో పాటు ఆయన కుమారుడు టిడిపి యువనేత కొత్తపల్లి ఆశిష్‌అమత్‌లాల్, కుమార్తె పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



పార్టీ పటిష్టత కోసం పని చేయండి

-టిడిపి సీనియర్ నేత పెండ్యాల అచ్చిబాబు

-కొవ్వూరులో టిడిపి మినీ మహానాడు

-అజెండాలో 29 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - కొవ్వూరు

పార్టీ అభ్యున్నతి కోసం ప్రతి కార్యకర్త నాయకుడు చిత్తశుద్ధితో పనిచేయాలని టిడిపి సీనియర్ నాయకుడు ఆంధ్ర సుగర్స్ జెఎండి పెండ్యాల అచ్యుతరామయ్య సూచించారు, పట్టణంలో లిటరరీ కళ్యాణ మండపంలో మంగళవారం టిడిపి మినీ మహానాడు నిర్వహించారు. స్థానిక ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుతో పాటు ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. నియోజకవర్గంలో ఇటీవల మతి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సమావేశంలో సంతాపం ప్రకటించారు. ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం టిడిపి కట్టుబడి ఉందన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారంలోకొచ్చిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన 29 తీర్మానాలను ఆమోదించారు. ఈ తీర్మానాలను జిల్లా స్థాయిలో నిర్వహించే జిల్లా మహానాడుకు పంపిస్తామని ఎంఎల్‌ఎ ప్రకటించారు. టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకు గొర్రెల శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.చిన్ని, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, నాయకులు పెనుమాక జయరాజు, ఎం.కళాధర చక్రవర్తి, వి.వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ,టిడిపి నాయకులు

కార్యకర్తల త్యాగం వెలకట్టలేనిది

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కార్యకర్తల త్యాగం వెలకట్ట లేనిదని, నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు కార్యకర్త స్థాయిలోనే సేవలందిస్తానని మాజీ ఎంఎల్‌ఎ, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. మంగళవారం వేలివెన్నులో నిర్వహించిన మినీ మహానాడును నిర్వహించారు. తొలుత జడ్‌పి మాజీ అధ్యక్షులు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు మాట్లాడారు. పదవిని కాకుండా పనిని ప్రేమించే నాయకుడు శేషారావు అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు డివివి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర కమిటీకి తీర్మానం అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం శేషారావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పాలన ప్రపంచానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శేషారావు

రేషన్ షాపును తనిఖీ చేసిన కలెక్టర్

కొవ్వూరు : పట్టణంలో ఫ్యాక్టరీ రోడ్‌లో ఉన్న 16 నెంబర్ చౌక ధరల దుకాణాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యాషన్ డిపోలో ఉన్న స్టాక్ రికార్డులను, సరుకును ఆమె పరిశీలించారు. దుకాణం నిర్వహణలో సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. ఏ విధమైన అవకతవకలకు ఆస్కారం లేకుండా దుకాణం నిర్వహించాలని సూచించారు. పలువురు రేషన్ కారు దారులను విచారించి సరుకులు అందుతున్న తీరుపై ఆరా తీశారు.ఆర్‌డిఒ రాణి సుస్మిత తహసిల్దార్ ఎం దుర్గాప్రసాద్ ఇతర సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు

ఉండ్రాజవరం : సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజును మండలంలో పలుగ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాలంగిలోని స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో వడ్లూరు సర్పంచ్ యువసేన ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. పిల్లలకు విందు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘుమండ తేజశ్రీ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ తొలి చిత్రం 'నిన్ను చూడాలని' విడుదల నాటి నుంఇచ ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత ఉండ్రాజవరం అధ్యక్షులు కెఎస్.రాజు, వైసిపి నాయకులు రఘుమండ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు వేంద్ర రమేష్, ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారం, వెండి ఆభరణాల చోరీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గుర్తుతెలియని వ్యక్తులు తిరిగి తాళాలు పగలగొట్టి బండారు, వెండి నగలు చోరీ చేశారు. ఈ ఘటన కపిలేశ్వరపురం లో జరిగింది. స్థానిక వైయస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.పోసియ్య నాగమణి దంపతులు ఇటీవల వేరే ఊరికి వెళ్లారు. సోమవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి అంగర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రూ.లక్ష విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైయున్నట్లు వారు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గాయాల పాలైన వద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. మంగళవారం పోలీసుల వివరాలు ప్రకారం మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ ముసలయ్య (78) ఈనెల 8న తన ఇంట్లో వంట చేసుకుంటున్నాడు. ఈ సమయంలో గ్యాస్ పొయ్యి నుండి మంటలు చెలరేగి శరీరం కాలిపోయి ముసలయ్యకు గాయాలయ్యాయి. అతని కుమారుడు వీర్రాజు హుటాహుటిన ముసలయ్యను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ముసలయ్య సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని మందపల్లి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్లు కొత్తపేట ఎస్ఐ జి. సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కమ్మిరెడ్డి పాలెం కు చెందిన వాడ చైతన్య జనార్ధన(33) సోమవారం రాత్రి రావులపాలెం వెళ్లి తిరిగి 1.45 గంటలకు వస్తున్నాడు. ఈ సమయంలో మందపల్లి వంతెన సమీపంలోని కళ్యాణి సోం పాపిడి స్వీట్ షాపు ఎదురుగా జనార్ధన మోటార్ సైకిల్ ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా విక్రేతపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడజం గ్రామానికి చెందిన సారా విక్రేత గొలుసు లక్ష్మిపై పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పట్టాభి చౌదరి తెలిపారు. ఇప్పటికే ఆమెపై ఐదు కేసులు ఉన్నాయని, సారా అమ్మకాలు చేయవద్దని ఇటీవల ఆమెను హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆమెపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇకనుండి ఎవరైనా సారా అమ్మకాలు చేసినట్లయితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ పోర్ట్‌లోని రైస్ మిల్లులో పనిచేస్తున్న సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన నక్క నాగేంద్ర మంగళవారం బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అయితే క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్ వాహనం రావడంలో ఆలస్యం కావడంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పోలీస్ వాహనంలో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమయస్ఫూర్తితో క్షతగాత్రుని తన వాహనంలో ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ ఎస్ఐని పలువురు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక టవర్ కాలనీ వద్ద నిర్వహించిన పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం తెల్లవారుజామున తన సిబ్బందితో దాడి చేసి, వారి నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో తీపర్రు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బాలిక ఈ నెల 19వ తేదీ రాత్రి కాలకృత్యాల నిమిత్తం బయటకు వెళ్లిందన్నారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు బాలిక వివరాలు తెలిస్తే 9440796642, 9154875611 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

మత్స్యకార యువకుడు గల్లంతు

గాలింపు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకార యువకులు బోటు బోల్తా కొట్టడంతో ఒకరు గల్లంతవ్వగా మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ సంఘటనపై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్ర తీరంలో వేట నిషేధం ఆంక్షలు ఉన్నప్పటికీ ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన ముగ్గురు మత్స్యకార యువకులు మెరుగుశ్యామ్ (19), వంక ఇసాక్(35), రామిశెట్టి వీరబాబు(35) సోమవారం అర్ధరాత్రి బోటుపై వేటకి వెళ్లారు. సముద్రపు అలలు తీవ్రంగా ఉండడంతో హోప్ ఐలాండ్ సమీపంలో బోటు బోల్తా కొట్టి సముద్రంలో యువకులు పడిపోయారు. వీరిలో వంక ఇసాక్, రామిశెట్టి వీరబాబు ఈదుకుంటూ హోప్ ఐలాండ్ చేరుకోగా, మెరుగు శ్యామ్ ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న అధికారులు గల్లంతయిన శ్యామ్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

ప్రవీణ్ సంస్మరణ సభకు ప్రభుత్వం అడ్డంకులు

పాస్టర్లకు బెదిరింపులు, పలువురి బైండోవర్

విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపీ హర్షకుమార్ ఆగ్రహం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ఈనెల 24న జరిగే పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు ప్రభుత్వం అడ్డంకులు కల్పిస్తుందని అమలాపురం మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ డిగ్రీ కళాశాల సమావేశపు హాలులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్మరణ బహిరంగ సభకు ప్రవీణ్‌ది హత్యే అనే నమ్మే వారందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. సభకు పెద్దఎత్తున హాజరవ్వడానికి క్రైస్తవులు సన్నద్ధం అవుతున్నారన్నారు. అయితే సభ జరగకుండా ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తుందన్నారు. ఇప్పటికీ అనుమతులు ఇవ్వలేదని, చర్చిల వద్ద పాస్టర్‌లు, క్రైస్తవులతో సమావేశాలు నిర్వహించి సభకు వెళ్ళవద్దని, వెళితే కేసులు పెట్టి, జైళ్లకు పంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. చర్చిల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఫొటోలు వేసిన వారిని స్టేషన్‌లకు పిలిపించి రూ.50వేల పూచీకత్తు కట్టించుకుని, బైండోవర్ కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ప్రవీణ్ మృతిని పోలీసులు యాక్సిడెంట్‌గా చిత్రీకరించారని విమర్శించారు. ప్రవీణ్ మరణించిన వెంటనే ఆయన ల్యాప్‌ట్యాప్, ట్యాబ్‌ను ఎందుకు స్వాధీనం చేసుకున్నారని, ఆయన ఎకౌంట్‌లను ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు. పోస్టుమార్టం, ఇతర అంశాలపై తాను ఆర్‌టిఐ యాక్ట్ ప్రకారం సమాచరం కోరితే అది పబ్లిక్ అంశం కాదని సమాచారం ఇవ్వడం లేదన్నారు. సభకు అనుమతి నిరాకరిస్తె పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

డాక్టర్ కర్రి రామారెడ్డి ఖాతాలో మరో 11 డిగ్రీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

నిత్యవిద్యార్థిగా ఇప్పటికే 50డిగ్రీలు పూర్తిచేసిన ప్రముఖ మానసిక వైద్యుడు, రాష్ట్రపతి పురస్కారగ్రహీత (డాక్టర్ బీసీ రాయ్ అవార్డు) డాక్టర్ కర్రి రామారెడ్డి తాజాగా మరో మైలురాయిని దాటారు. ఆయన మరో 11డిగ్రీలు పూర్తిచేశారు. ఈ పదకొండు కోర్సులు కూడా ఎలైట్ ప్లస్ సిల్వర్ (డిస్టింక్షన్‌తో సమానం), ఎలైట్ ప్లస్ గోల్డ్ (90శాతం పైన మార్కులు)తో సాధించారు. ఆయన మూడు డాక్టరేట్లు, ఐదు ఎల్ఎల్ఎంలు, ఎంబిఎ, ఎంసిఎ, ఎంటెక్, ఎం.ఎ, ఎంకామ్.. ఇలా డిగ్రీలమీద డిగ్రీలు సాధిస్తూ, విభిన్న రంగాలలో వివిధ కాలిఫికేషన్స్ కలిగి ప్రపంచ రికార్డుల్లో నిలిచిన వ్యక్తి డాక్టర్ రామారెడ్డి. 70 ఏళ్ల వయస్సులో ఆయన ఈ 11 డిగ్రీలను పూర్తి చేశారు. స్థానిక మానస హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి రెండు మూడు డిగ్రీలు మాత్రమే పూర్తిచేస్తున్న సమయంలో, ఇంకా ఎక్కువ కోర్సులు చేయాలనే ఆకాంక్షతో సర్టిఫికెట్ కోర్సులు కూడా చేయడం ప్రారంభించానని తెలిపారు. ఈ ఏడాది జనవరి–జూన్‌ఒకే సెమిస్టర్‌లో 11 ఎన్‌పిటెల్ కోర్సులు ఒకేసారి పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. ఈ 11 కోర్సుల్లో ఎనిమిది కోర్సుల్లో టాపర్లలో ఒకరుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. జిఎస్ ఎల్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ 70ఏళ్ల వయస్సులో 61డిగ్రీలు సాధించడం మామూలు విషయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ దాట్ల సతీష్, పివిఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామారెడ్డి

మార్కొండపాడులో సర్వే పరిశీలన

ప్రజాశక్తి చాగల్లు

చాగల్లు మండలం మార్కొండపాడులో జరుగుతున్న స్వమిత్వ సర్వే పనులను, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి, బృంద సభ్యులకు పలు సూచనలుచేశారు. 9(2) నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, గ్రామ సర్వేయర్, విఆర్ఒ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగర ప్రజలందరికీ అధునాతన మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ త్వరలో అందుబాటులోకి రానుందని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. నారాయణపురంలోని గోదావరి పుష్కరాలు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రిని పరిశీలించారు. మరో ఐదు రోజులలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. దాదాపు రూ.4.30 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందులో షూటింగ్, స్నూకర్(బిలియర్డ్స్), టేబుల్ టెన్నీస్, చెస్, క్యారెమ్స్‌తో పాటుగా లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో జిమ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాజమహేంద్రవరంలో క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు.

ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

నగరంలోని పల్లపు ప్రాంతాలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హామీ ఇచ్చారు. స్థానిక 39వ వార్డులో 36, 38, 39 డివిజన్ల కు సంబంధించి రూ.1.50 కోట్లతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షం కురిసిన సమయంలో పల్లపు ప్రాంతాలు జలమయం కాకుండా చూడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వీరభద్రపురం, బోధి స్కూలు, కష్ణానగర్, ఆదెమ్మ దిబ్బ, లింగంపేట వాంబే గృహాలు, ఎస్.ఆర్.సి లైనులో ఎక్కువ నీట మునుగుతున్నట్లు గమనించామన్నారు. వీరభద్రం పురం వద్ద డ్రైను నిర్మించడం వల్ల వర్షం నీరు అరగంటలో లాగేసిందని, గతంలో రెండు గంటలు పట్టేదన్నారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం సరైన రీతిలో జరిగితేనే వర్షం నీరు కాలువలోకి వెళుతుందన్నారు. ఈ సమస్యకు సరైన పరిష్కారం చూపిస్తామన్నారు. రూ.1.5 కోట్ల రుడా నిధులతో రోడ్డు లెవెలింగ్ పనులు చేపడుతున్నామన్నారు. ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-గోకవరం

ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, ప్రజలు సంతృప్తి చెందేలా సేవలను అందిస్తామని జెసి ఎస్.చిన్నరాముడు అన్నారు. గోకవరం తహాశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రేషన్, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, సిలిండర్ డెలివరీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌర సేవలు సక్రమంగా అందించేందుకే ఐవిఆర్ఎస్ సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయంలో వినియోగదారులకు ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. సరుకుల పంపిణీ విషయంలో ఎటువంటి అదనపు వసూళ్లు చేయరాదన్నారు. ఎండియు వాహనం ద్వారా ఇళ్ల వద్ద సరుకుల పంపిణీ చేసే సమయంలో ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కింద ప్రభుత్వం అర్హత కలిగిన లబ్ధిదారులకు ఏడాదికి మూడు సిలిండర్లు అందిస్తున్నామన్నారు. సిలిండర్లు అందచేసే ప్రక్రియలో అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి నిబంధనలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ ఎంవి.సాయిప్రసాద్, ఎఒ శ్రీనివాస్, రేషన్ షాప్, చౌక ధరల దుకాణాల డీలర్లు, గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్, రెవెన్యూ, పౌర సరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి

దేవాలయాల భూములకు వేలం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రులో దేవాలయాల భూములకు ఈడుపుగంటి రత్తమ్మ సత్రంలో మంగళవారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎంవి.రామయ్య వేలం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన 13.23 ఎకరాల వ్యవసాయ భూమిని 7 ప్రతులుగా వేలం వేయగా రూ.7.05లక్షల ఆదాయం లభించింది. గతంలో రూ.5,69,300 మాత్రమే వేలం ఖరారైంది. ఈ ఏడాది అదనంగా రూ.1,35,700 ఆదాయం సమకూరింది. శ్రీమతి ఈడ్పుగంటి రత్తమ్మ ధర్మసత్రానికి చెందిన 88 సెంట్ల భూమి వేలం ద్వారా రూ.31వేలు వచ్చింది. గంతో రూ. 29వేలు ఉండగా ప్రస్తుతం ఆదాయం రూ.2వేలు పెరిగింది. శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి ఆలయానికి చెందిన 11.12 ఎకరాలకు రూ.3.28లకు వేలం ఖరారైంది. గతంలో ఈ భూమికి రూ.3.22లక్షలు వేలం ఖరారైంది. ఈ కార్యక్రమంలో కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, సీతారాం బోగవల్లి చంటిబాబు, బలుసు రంగారావు, నందమూరి నారాయణరావు, జూనియర్ అసిస్టెంట్ వైఎం.బాలాజీ, ఉసులమర్రు, కాకరపర్రు, తాడిపర్రు, వెలగదుర్రు రైతులు పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

మూత కప్పుతున్న సిబ్బంది

మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియంలో ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్‌కు పంచాయతీ సిబ్బంది మూతను ఏర్పాటు చేశారు. 'ఆదమరిస్తే... ప్రమాదమే' శీర్షికన మ్యాన్ హోల్ వల్ల కలుగుతున్న సమస్యలు, పొంచి ఉన్న ప్రమాదంపై ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయమే మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఎస్ఎల్ స్టాక్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఊనగట్లలో ఉన్న ఎంఎస్ఎల్ స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మితతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మండలంలో స్టాక్ పాయింట్లు వద్ద ఉన్న సరుకుల స్టాక్ వివరాలు, రిజిస్టరు ప్రకారం నిర్వహిస్తున్నారో? లేదో?, ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌర సేవలు అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరుపై జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న స్టాక్, రిజిస్టర్ ప్రకారం సరిగ్గా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదిక అందించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. వారి వెంట తహాశీల్దార్లు ఎం.మెరికమ్మ, ఎం.దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మంచానికే పరిమితమైన పెద్దేవం గ్రామానికి చెందిన బొర్రా సూరిబాబుకు వైసిపి నాయకులు రూ.45 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఉపసర్పంచ్ తోట రామకృష్ణ సమక్షంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు బాధితునికి మంగళవారం ఈ మొత్తాన్ని అందజేశారు. బాధితుడు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు బట్టు సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి వైఎస్ఆర్ కాలనీ ఆర్చి వరకు రహదారిపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గుంతల కారణంగా ఇక్కడ పలు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. ప్రతి ఆదివారం కోట సత్తెమ్మ ఆలయాన్ని దర్శించుకోవడానికి ఉభయగోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరంతా ఈ గుంతల రోడ్డులోనే ప్రయాణించాల్సి ఉంది. అలాగే వైఎస్ఆర్ కాలనీ, జగనన్న కాలనీ, రావిమెట్ల, కంసాలి పాలెం, మాధవరం, తాడేపల్లిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు సైతం ఈ దారినే రాకపోకలు సాగిస్తుంటారు. ఎటువంటి ప్రమాదం జరుగక ముందే గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయ పునరుద్ధరణకు కేబినెట్ ఆమోదం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయ పునరుద్ధరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీని ఎపికి తరలించే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలపడం తద్వారా కళలకు కాణాచి, సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరానికి పునఃవైభవం వస్తుందన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం చట్టం – 1985లోని సెక్షన్ 3(2) ప్రకారం ఏపీలోని రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతుల ఉన్నత స్థాయి పరిశోధన కేంద్రంగా తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని తెలిపారు. అన్ని భాషలను గౌరవిస్తూనే మాతృభాషకు అగ్రతాంబూలం ఇవ్వాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెలుగు భాష మరియు సాహిత్యం ఆధారంగా కళా సంస్కృతి, సంగీతం, రంగస్థల నాటకాలు, చిత్ర లేఖనం తదితర వాటిలో అధునాతన అధ్యయానికి, పరిశోధనలు సులభతరం చేయడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. భవిష్యత్‌లో జరిగే శాస్త్రీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి రంగంలోనూ ప్రాచీన తెలుగు పరిశోధనలకు అవకాశం కల్పించబడుతుందన్నారు. అంతేగాక తెలుగు భాషా సాహిత్యాలు, కళలు, సంస్కృతి, శాస్త్రాలు సంపూర్ణంగా, సమగ్రంగా అభివృద్ధి చెందాలన్న సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా ప్రజల తరపున సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంస్కృతి, వారసత్వానికి వారధిగా నిలుస్తూ పవిత్ర గోదావరి చెంతన ఉన్న రాజమహేంద్రవరంలో తెలుగు వైభవంగా వెలుగొందు తుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాషా సంస్కృతులు, కళలు మరింతగా విరాజిల్లుతాయన్న అభిప్రాయాన్ని మంత్రి దుర్గేష్ వ్యక్తం చేశారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పాఠశాల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అమలాపురం మండల వనరుల కేంద్రం, జిల్లా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె 2025 – 26 అకాడమిక్ సంవత్సరానికి రావలసిన స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు సరఫరా కాబడిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను, డిక్షనరీలను సురక్షిత ప్రదేశంలో స్టోర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థి నమోదు ప్రక్రియ పెంచుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అలాగే జిల్లాలోని 6 నుంచి 18 సంవత్సరాల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను సేకరించి వారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో నమోదు అయ్యేటట్లు చూడవలెనని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొగలైజేషన్ అధికారి బివివి. సుబ్రహ్మణ్యం, అమలాపురం మండల విద్యాశాఖ అధికారి సరేళ్ళ దుర్గాదేవి, బండారులంక భవిత సెంటర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం మండల వనరుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి మమ్మీ

స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన డిఇఒ

మామిడికుదురు: లూటుకుర్రు హైస్కూల్ లో విద్యా మిత్ర స్టాక్ పాయింట్‌ను డిఇఒ షేక్ సలీం బాషా మంగళవారం పరిశీలించారు. టెక్స్ట్ బుక్‌లు పాఠశాల వారీ ఏర్పాటుచేసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. బెల్టులు కూడా వచ్చాయని, ఇంకా బ్యాగ్‌లు, యూనిఫామ్, బూట్లు, సాక్స్ రావాల్చి ఉందన్నన్నారు. స్టూడెంట్స్ కిట్లను పరిశీలించి మండల టీమ్‌నకు తగు సూచనలు చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు పున్నప్రారంభం సమయానికి స్టూడెంట్స్ కిట్స్ అందజేస్తామన్నారు. ఈ కిట్స్ లో విద్యార్థులు కు స్కూల్ బ్యాగ్స్, షూస్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, బెల్ట్స్, యూనిఫామ్, డిక్షనరీ లను అందజేస్తారు. మండలం లో 2025–26 విద్యా సంవత్సరం లో భాగంగా 3343 మంది విద్యార్థులకు ఇప్పటివరకు టెక్స్ట్ బుక్స్, బెల్ట్స్ వచ్చాయన్నారు. మిగిలిన ఐటమ్స్ అన్ని రావలసి ఉందన్నారు. ఆయన వెంట ఎంఇఒలు లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ చోడవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 139 / 2023

బిట్వీన్:
లెక్కల రామలక్ష్మి వగైరాలు . . . వాదులు
అండ్:
లెక్కల వేణుగోపాల్ వగైరాలు ... ప్రతివాదులు
టు:
డి–5: సబ్బవరపు గంగాభవాని, W/o.అప్పలనాయుడు, D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, డో.నెం. 3/79/1, వివేకానందనగర్, Near ఎండాడ పెట్రోల్ బంక్, గీతం పోస్టు, విశాఖపట్నం.
డి–6: బర్ల కృష్ణవేణి, W/o. లేటు రాంబాబు D/o.లేటు ఎర్రునాయుడు @ చిట్టిబాబు @ చిట్టినాయుడు, సా॥ పి.తిమ్మాపురం గ్రామం పిఠాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా. (ప్రస్తుతం కాకినాడ జిల్లా)
పై నెంబర్ను వాద్లు ప్రతివాదలుపైని పంపకం దావాదాఖలు చేయగా 5@6 ప్రతివాదులుకి సమన్లు సర్వు నిమిత్తం తే:19–6–2025 దీకి దావా వాయిదా వున్నది. అయితే పై నెంబరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్ననూ మీరు **తే: 19–6–2025దీ ఉదయం 10–30కి** మీరు స్వయంగా గాని, లాయరుగాని ద్వారా గాని, పై కోర్టులో హాజరుఅయి తెలియపర్చు కోవలెను. లేననియెడలా మీ పరోక్షమందు తదుపరి ఉత్తర్వులు జారీ చేయడమగును అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

P.PRAKASA RAO
Advocate, Chodavaram
Visakhapatnam.
Cell : 94410 19918

Chodavaram
Dt. 20-5-2025

పుట్టిన తేదీ ధ్రువీకరణ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను పట్యం సాయిరామ్, తండ్రి: అప్పారావు, తల్లి: పట్యం సరోజిని, డో.నెం. 15–4–16/2, బాపూజీ నగర్, కొవ్వూరు, తూ॥గో॥జిల్లాకు చెందిన దంపతులకు 27–07–1953వ సంవత్సరంలో 3వ కుమారుడుగా జన్మించి ఉన్నాను. ఈ తేదీ నాయొక్క SSLC సర్టిఫికెట్ ననుసరించి ధ్రువీకరించబడినది. కావున నా జనన తేదీ ధ్రువీకరణపై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములున్నా నేటి నుండి 7 రోజుల లోపుగా కొవ్వూరు RDO ఆఫీసు నందు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

పట్యం సాయిరామ్
S/o. పట్యం అప్పారావు, బాపూజీ నగర్, కొవ్వూరు, సెల్. 8179516055

పాస్‌పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, గొంది గ్రామానికి చెందిన కొప్పాడి దశరథుడు S/o. సుబ్బరాజు లు చెందిన నెంబరు **G 6836914** గల పాస్‌పోర్ట్ పడిపోయినది. ది. 17–04–2025 తేదీన పాస్‌పార్ట్‌ను జిరాక్స్ తీయించుకునే నిమిత్తం ఇంటి వద్ద నుండి సఖినేటిపల్లి సెంటర్‌కు మోటారు సైకిల్‌పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

కొప్పాడి దశరథుడు
S/o. సుబ్బరాజు, డో.నెం. 1- 17
గొంది గ్రామం, సఖినేటిపల్లి మండలం

పత్రికా ప్రకటన

కీ॥శే॥ పట్టా తిరుపతిరావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.యానం, శ్రీరామ్ నగర్ గ్రామం, డో.నెం. 1–94 కాపురస్తులు పట్టా తిరుపతిరావు (లేటు), S/o. గంగరాజు (లేటు) గారి భార్య పట్టా లక్ష్మి ఇచ్చిన పత్రికా ప్రకటన.
నా భర్త **పట్టా తిరుపతిరావు గారు** ఎస్.యానం గ్రామంలో మా ఇంటి వద్ద 25–04–2006 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎస్.యానం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **పట్టా లక్ష్మి**
W/o. పట్టా తిరుపతిరావు (లేటు), డోర్ నెంబర్: 1-94, ఎస్.యానం, శ్రీరామ్‌నగర్ గ్రామం
ఉప్పలగుప్తం మండలం, సెల్: 7799110126

పత్రికా ప్రకటన

కీ॥శే॥ పెమ్మాడి అప్పారావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.యానం, శ్రీరామ్ నగర్ గ్రామం, డో.నెం. 1–94 కాపురస్తులు పెమ్మాడి అప్పారావు (లేటు), S/o. కొండయ్య (లేటు) గారి భార్య పెమ్మాడి సీత ఇచ్చిన పత్రికా ప్రకటన.
నా భర్త **పెమ్మాడి అప్పారావు గారు** ఎస్.యానం గ్రామంలో మా ఇంటి వద్ద 25–08–2017 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎస్.యానం గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: **పెమ్మాడి సీత**
W/o. పెమ్మాడి అప్పారావు (లేటు), డోర్ నెంబర్: 1-94, ఎస్.యానం, శ్రీరామ్‌నగర్ గ్రామం
ఉప్పలగుప్తం మండలం, సెల్: 7799110126